క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల అందజేత



గాంధారి(ఎల్లారెడ్డి) : స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంఈవో సేవులా మండల పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. మండలానికి 4,980 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా 4,810 పుస్తకాలు వచ్చాయని ఎంఈవో అన్నారు. అలాగే 18,000 నోటు పుస్తకాలు వస్తే హెచ్‌ఎంలకు అందజేశామని ఎంఈవో తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



భిక్కనూరు : సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని భిక్కనూరు ప్రభుత్వ వైద్యురాలు యెమిమా అన్నారు. గురువారం భిక్కనూరు పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురియగానే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీని విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసూతి జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వెంకటరమణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ పురుగుల దుకాణాన్ని గురువారం క్లస్టర్ ఎఈవో గ్రీష్మ తనిఖీ చేశారు. పురుగు మందులతో పాటు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించా లని సూచించారు. విక్రయాలు జరిపిన ప్రతీ వస్తువుకు బిల్లులను రైతులకు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. ఆమె వెంట స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ విస్తీర్ణాధికారిణి వీణ గురువారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె దుకాణాల్లోని స్టాక్‌ను, బిల్‌బుక్‌లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : పట్టణంలోని ఫర్టిలైజర్ షాప్‌లను ఏవో హరీష్‌కుమార్ గురువారం తనిఖీలు చేశారు. దుకాణాలలోని స్టాక్, సేల్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణాలలో రైతులకు విక్రయించిన విత్తనాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతులకు రిసిప్ట్‌లను ఇవ్వాలని అన్నారు. ధరల వివరాల పట్టికను డిస్‌ప్లే చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ఎల్లారెడ్డి : రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సీఐ రవీందర్‌నాయక్ వాహనదారులకు వివరించారు. గురువారం ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ నారాయణలతో కలిసి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలలో సూచికల ఏర్పాటు, పొదల తొలగింపు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు గురించి చర్చించారు. ఎస్సై మహేష్ తదితరులున్నారు.

సోయాబీన్ విత్తనాల పంపిణీ



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం బాసర రకం సోయాబీన్ విత్తనాలను రైతులకు మండల వ్యవసాయ అధికారి రాజు, మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మెన్ చాట్లావార్ గోపాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయాబీన్ బాసర రకం 8 కిలోల విత్తనాల బ్యాగు రూ. 650 రైతుకు అందిస్తామన్నారు.



గాంధారిలో ఉపాధ్యాయులకు బడిబాటపై సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో చందర్‌నాయక్



ఇసన్నపల్లిలో..



మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో..

బడిబాట ప్రారంభం



తాడ్వాయిలోని ఎర్రాపహాడ్‌లో..



దోమకొండలో బడిబాట సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

బడి బయట ఉన్న బడీడు పిల్లలందరినీ సర్కారు బడుల్లో చేర్పించాలనే నినాదంతో గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలను వివరించారు. నాణ్యమైన బోధన, ఉచిత పుస్తకాలు, ఉచిత మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు ఉంటాయని వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



కల్యాణిలో..



కాటేపల్లి గ్రామంలో..



లింగంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



పిట్లంలో..

సురేశ్ షెట్కార్‌కు సన్మానం

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా విజయం సాధించిన సురేశ్ షెట్కార్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలను తెలిపారు. ఆయన కూతురు ఏఐసీసీ స్పోక్ పర్సన్, సోషల్ మీడియా ఇంచార్జీ డాక్టర్ గిరిజా షెట్కార్‌ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిప్రసాద్ ఉన్నారు.

దోమకొండ నుంచి..

దోమకొండ : జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేశ్‌షెట్కార్‌ను గురువారం దోమకొండ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ నివాసంలో ఎంపీకి సన్మానించామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామస్వామిగౌడ్, నర్సాగౌడ్ ఉన్నారు.



ఎంపీ సురేశ్ షెట్కార్, ఆయన కూతురు డాక్టర్ గిరిజను సన్మానిస్తున్న జ్ఞానేశ్వరి తదితరులు

భిక్కనూరు నుంచి..

భిక్కనూరు : జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేశ్ షెట్కార్‌ను మండలంలోని జంగంపల్లి, మల్లుపల్లి కాంగ్రెస్ నేతలు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు నర్సింలు యాదవ్, కొమ్మ రమేశ్, పుల్లూరి రామస్వామి, చిట్టబోయిన నర్సింలు తదితరులున్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు సన్మానం



బాన్సువాడ : ఇటీవల జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పాత బాలకృష్ణ సన్మానించారు. తన మిత్రుడు, శ్రేయోభిలాషి కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీ గణేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కార్యకర్తల కృషితోనే విజయం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : జహీరాబాద్ ఎంపీగా సురేశ్ షెట్కార్‌ను గెలిపించిన కాంగ్రెస్ కార్యకర్తలకు మండల కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, రాంచందర్, గంగారెడ్డి, విఠల్ తదితరులున్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలని వినతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కళాశాల ఎదుట వారు నిరసన తెలిపారు. 2023–2024కు సంబంధించి కోపా, మెకానిక్ డీజిల్ కోర్సులను పూర్తి చేశామని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినా కళాశాల సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. కళాశాలలో ఉన్న తాత్కాలిక సిబ్బంది తన వద్ద తాళాలు లేవని ప్రిన్సిపల్ లీవ్‌లో ఉన్నారని సమాధానం చెబుతున్నారని దీంతో తాము ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఐటీఐ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కల్లాలతో రైతులకు ఎంతో మేలు

భిక్కనూరు : రైతులకు అవసరమైన కల్లాలను నిర్మింపజేస్తున్నామని దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలంలోని కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, భాగిర్తి పల్లి, బస్వాపూర్, సిద్దరామేశ్వరనగర్, భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్ లక్ష్మీదేవునిపల్లి, జంగంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. కల్లాల వల్ల రైతులు తాము పండించిన పంటలను ఆర బెట్టుకునేందుకు ఉపయోపడుతుందన్నారు. రైతులు తమకు అనువైన స్థలలను పరిశీలించి తనకు తెలియజేస్తే కల్లాల నిర్మాణంను చేపడ్తామన్నారు. కల్లాలు ఏర్పాటైతే అక్కడే ప్రభుత్వం తరపున రైతులు తాము పండించుకునే పంటలను నిల్వ ఉంచుకునేందుకు గోదాములను నిర్మింపజేయడం జరుగుతుందన్నారు. అలాగే భిక్కనూరు దళిత వాడలో ఉన్న మాతమ్మ ఆలయం ఉత్సవాల కోసం ఎమ్మెల్యే కేవీఆర్‌ను దళితులు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు, బండి రాములు, కేవీ సుబ్బారావు, రమేష్, బాబు, నర్సింలు తదితరులున్నారు.



ఎమ్మెల్యే కేవీఆర్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న దళితులు

నేడు అటల్ టింకరింగ్ క్యాంప్ ప్రారంభం



భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అటల్ టింకరింగ్ వేసవి క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి తమ్మలి రాజు గురువారం తెలిపారు. విజ్ఞాన్ ఆశ్రమ్ పూణే, సమగ్ర శిక్షా తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో మండలంలోని ఆరు పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ బూత్ క్యాంప్ ద్వారా ఎలక్ట్రానిక్స్ ప్రొగ్రామింగ్‌కు సమగ్ర పరిచాయాన్ని అందించి విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచి ఉత్సుకత ఆవిష్కరణలను ప్రోత్సహించే అభ్యాస వాతావరణాన్ని కల్పించడం జరుగుతుందన్నారు.

యూనిఫాం కుట్టు కేంద్రాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలో యూనిఫాం కుట్టు కేంద్రాలను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభంకానుండటంతో యూనిఫామ్స్‌ను సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు అందరికీ యూనిఫామ్స్ అందిచేందుకు సహకారించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వేణుగోపాల్‌రెడ్డి



బీబీపేట : మండలంలోని జనగామ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఇటీవల ఎంపీగా గెలుపొందిన సురేశ్ షెట్కార్‌ను కూడా ఆయన సత్కరించారు. వేణుగోపాల్‌రెడ్డి సతీమణి వాణి కూడా ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గురువారం యువకులు క్రాంతి కుమార్, వినీత్, శ్రీరాం, రంజిత్ అధికారులను కలిసి మొరపెట్టుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు వీధుల్లో ఆర్నెళ్లుగా పేరుకుపోయిన చెత్తా, చెదారం తొలగించాలని, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్‌ను వీధుల్లో తిప్పాలని కోరారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.



అధికారికి సమస్యలు వివరిస్తున్న యువకులు

ఇంటినంబర్ లేని యజమానులు సంప్రదించాలి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలో నూతనంగా ఇండ్లను నిర్మించుకున్న యజమానులు ఇంటి నంబర్ కోసం మున్సిపల్ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని మున్సిపల్ కమీషనర్ సుజాత తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని దేవివిహార్, దేవునిపల్లిలో నూతనంగా నిర్మించిన ఇండ్లను పరిశీలించారు. వాటికి ఆస్తి పన్ను కోసం కొలతలు చేయించి పన్నులు విధించారు. అలాగే నూతన ఇంటి నంబర్‌లను కేటాయించారు. పట్టణ పరిధిలోని ఇంటి నంబర్‌లేని యజమానులు స్పందించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ జానయ్య, బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.



ఇంటి కొలతలు తీస్తున్న మున్సిపల్ అధికారులు

ఆధ్యాత్మికం

అన్నదానం



భిక్కనూరు : మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో సాయిహనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. నిరుపేదలకు, వృద్ధులకు ఈ అన్నదాన కార్యక్రమంలో భాగంగా ప్రతి గురువారం అన్నదానం చేస్తామని సమితి ప్రతినిధులు తెలిపారు.

గ్రామ దేవతలకు ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామంలో శనివారం నుంచి గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శన, ఆదివారం బోనాలు, సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను గ్రామస్తులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు మీసానిపల్లిలో బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మీసానిపల్లి గ్రామంలో నేడు బోనాల పండగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, బోనాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో గురువారం అమావాస్య రావడంతో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుండి చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు తరలి వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న హనుమాన్ ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

పోతురెడ్డి హనుమాన్ ఆలయంలో..



పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డి హనుమాన్ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తేజ స్వామి మాట్లాడుతూ అమవాస్య సందర్భంగా ఆలయంలో గణపతిహోమం, నవగ్రహ హోమం నిర్వహించామన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సంక్షిప్తం

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని క్రిష్టాజీవాడి గ్రామంలో ఉన్న కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న గద్దెను నిర్మించి దానిపైనా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేశారు. మనుషులు, పశువులకు అందేలా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తైన గద్దెను ఏర్పాటు చేసి ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

10న వరుణ్ మోటార్స్‌లో ఇంటర్వ్యూలు

కామారెడ్డి అర్బన్ : ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈనెల 10న కలెక్టరేట్‌లోని 121 నెంబర్ గదిలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు కామారెడ్డి వరుణ్ మోటర్స్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 25 నుంచి 35 ఏళ్లలోపు ఉండి ఇంటర్, మెకానికల్ ట్రేడ్ డిప్లొమా, డిగ్రీ, బీటెక్ అర్హత ఉన్న వారు హాజరుకావచ్చన్నారు. వేతనం నెలకు రూ. 14 వేల నుంచి 25 వేల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 98482 37987, 76719 74009 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

జీపీలకు నిధులివ్వండి



బీబీపేట : జీపీల నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇప్పించాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు రావడం లేదని దీంతో పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కృష్ణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్న సంఘాలు అభివృద్ధి చెందాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో గల చిన్న సంఘాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని సీసీ నర్సింలు అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్, దేమికలాన్ గ్రామాల్లో గురువారం గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించుకున్నారు. ప్రతినెల 10తేదీలోపు శ్రీనిధి, బ్యాంకు లింకేజి రుణాలు చెల్లించేలా తీర్మాణాలు చేశారు. అర్హులైన గ్రూపులకు రుణాలు పొందాలన్నారు. పాడిపశువుల కొనుగోళ్లకు కూడా రుణాలిస్తారన్నారు. వీవోఏలు రాజేశ్వరి, రాధిక, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.